# వర్తమాన శకలం

## 1

"అమ్మేదీ, విశాలా?"

"అత్తయ్యింటికి వెళ్ళిందక్కా!"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? నిన్ని నెలలో మంచి రోజు చూచి మన ఇంటికి తీసుకువచ్చి—"

"ఊఁ! తీసుకొచ్చి—"

"నీ పురుడయ్యేవరకూ వుంచుకొని పంపుతానని అడగడానికని వెళ్ళిందే."

"అదేమిటే, విశాలా! నిండా ఆర్నెల్లు కాలేదు; అప్పుడే నన్ను తెచ్చి ఇంటిలో పెట్టుకొంటానని అడగడమేం బాగుంటుందే? నీవైనా అడ్డుపెట్టలేకపోయావే?"

"అడ్డుపెట్టలేక కాదక్కా! అమ్మతో తిరిగి అననంటే నీకో చిన్న రహస్యం చెప్తా."

"చెప్పు, ఫర్వాలేదు, చెప్పవే"

"మరేం లేదక్కా. నీ పెళ్ళిచేసి సంవత్సరం దాట్తున్నా అల్లుడిగార్కి మొదటి దీపావళి, మొదటి సంక్రాంతి పండుగ సర్దాలన్నా తీర్చలేకపోతున్నామే అని అమ్మకెంతో బెంగ!"

"అమ్మసంగతి ఎవరికి తెలియదూ? ఆ కాలంలా, ఈకాలంలోకూడా ఆహంగులూ ఆర్భాటాలూ ప్రదర్శించుకోవాలనే పిచ్చి కదా! అయితే -"

"అయితే - ఏముందీ? రేపు దీపావళీ, ఆపైన సంక్రాంతీ దగ్గరకొచ్చాయిగదా! ఈ పండుగలకైనా అల్లుడిగార్కి ఖుషీ చేయాలనీ, నీ పురుడూ బారసాల వైభవంగా జరిపించాలని రాత్రింబవళ్లూ ఒకటే ఆలోచిస్తున్నది!"

"ఆలోచ నెందుకింక?"

"అదేమిటే అక్కా? చేతిలో డబ్బేదీ? అది లేనప్పుడింక వినోదాలేమిటీ, విలాసాలేమిటీ, నా బొంద!"

"అయితే, ఇదేం పనమ్మా?"

**కె. పి. బాబు**

"ఏముందీ - నన్నిప్పుడు తెచ్చి ఇంట్లో పెట్టుకొంటే, నీవు వున్నంతకాలం నెలనెలా నీకొచ్చే జీతంతో ఈ ఖర్చులన్నీ సరిపుచ్చుకోవచ్చుగదా అని అమ్మ ఆలోచన!"

"అ...మ్మ!"

"ఈ సంగతి ఎంతో గుట్టుగా ఉంచింది సుమా! నీవుగాని ఏమాత్రం తేలిపోయినా, నా పిలక పట్టుకొంటుందే! జాగ్రత్త!"

"హుఁ! అమ్మ చివరికి ఎంత దిగజారిపోతూంది?"

"ఏంచేస్తుందే మరింక? తన పెద్ద అల్లుళ్ళందరకూ చాల కాలంవరకూ ప్రతి పండుగ పబ్బానికీ ఎంతో ఘనంగా సత్కారాలు చేసేదట! పెద్దమ్మాయిలందరి పురుళ్ళూ ప్రజలంతా కలకాలం గుర్తుంచుకొనేటంత దివ్యంగా నెరవేర్చిందట! ఆనాటి ఆ వైభోగాలన్నీ అమ్మ వర్ణించి చెప్తుంటే, - ఆమెకు కన్నీరొస్తుంది కాని; నాకేమో భలే ఆశ్చర్యం కల్గుతుందిసుమా!"

"ఆనాడలాగని నేడిలా చెయ్యటం బాగుంటుందా? సర్లె - నే నింటికి వెళ్తున్నాను. అమ్మ కలిస్తే సరేసరి - లేకపోతే మాత్రం నే నిలా వచ్చివెళ్లానని చెప్పడం మరిచిపోకుసుమా! ఊర్లో ఉంటూకూడా కని పెంచినదాన్ని పరామర్శించనైనా లేదని - ఓ. బాధ పడ్తుంది, పిచ్చిది!"

"అది సర్లేగాని - ఈ సంగతి మాత్రం నీవు చాల భద్రంగా ఉంచాలిసుమా!"

"అలాగే లేవే - నీవో పిచ్చిపిల్లవే!"

## 2

—అలా పుట్టింటినుండి అత్తింటికి బయల్దేరిన కామాక్షి పైకి మామూలుగానే కన్పిస్తున్నా, లోలోన మాత్రం పరిపరివిధాల చింతిస్తూ నడువసాగింది......

ఆ ఊళ్లో ఒకప్పుడు సూరయ్యంటే - గొప్ప భూస్వామీ, దానకర్ణుడూ, గుణశీలి! అందమైన భవనంలో, గొడ్డూ గోదాతో తోటలూ దొడ్లూ; పొలం పుట్రా సరిచూచుకొంటూ అందరకూ తలలో నాల్కగా కాలంగడిపేవాడాయన! సూరయ్యకి వరుసగా ఆరుగురూ ఆడపిల్లలే పుట్టారు. అయిదేళ్లు ఎదిగి ఒకతె చనిపోగా అయిదుగు రమ్మాయిలు మిగిలారు. వారినే తమ పంచప్రాణాలుగా సూరయ్యా పేరమ్మా ఎంతో గారాబంగా పెంచుకొచ్చారు.

మొదటి ముగ్గురికీ సూరయ్య గొప్పింటి సంబంధాలు స్వయంగా వెతికి వెతికి మరీ తెచ్చి పెళ్లిళ్లు చేశాడు! ఒక్కొక్క పిల్లకీ వేలకు వేలు కట్నాలు గుమ్మరించాడు. అయిదేసి రోజులు, వేలాది సొమ్ము వెచ్చించి మరీ అట్టహాసంగా వివాహాలు జరిపించాడు. బ్రాహ్మణులకు సంభావనలేమిటి - బీదలకు అన్నవస్త్రదానాలేమిటి - బంధుమిత్రులకు పంచభక్ష్య పరమాన్నాదులతో సత్కారాలేమిటి - ఓ....పిల్ల జమీందారనిపించాడు సూరయ్య!

ఆనాటి ఊరేగింపులు - ఈనాటికీ ప్రజల కళ్ళముం దాడ్తున్నాయ్!...బ్యాండ్, సొన్నాయ్, గన్‌సెట్, నౌబత్‌ఖానా, రాండోళ్లు - ఊఁ...ఇంకా - భోగం మేళాలు, బొమ్మలాటలూ - గ్యాస్ లైట్లతో పూలఓడలో ఊరేగింపు!........

అంతా చూస్తూ "నా వంశ పరువు ప్రతిష్ఠలు నిలిపానుగదా!" అని గర్వపడ్డాడు సూరయ్య! "నా గౌరవమర్యాదలు పెంచుకొనగల్గానని" తృప్తిచెందాడు. ఆ తృప్తితోనే హాయిగా ఓనాడు కన్నుమూశాడాయన......

.........ఆ వైభవాలూ, ఉత్సాహాలూ, అట్టహాసాలూ, అన్నీ సూరయ్యతోనే సరిపోయాయా అన్పించేది ఊరివారందరకూ. అభిమానవతియైన పేరమ్మ కదెంతో ఆవేదన కల్గించేది! మిగతా ఇద్దరు పిల్లలకూ తానైనా పూనుకొని వెనుకటి విధంగానే - హంగూ ఆర్భాటాలతో వైభవోపేతంగా వివాహాలుచేసి, పంపించి మరీ సుఖంగా భర్తను చేరుకోవాలని విపరీతంగా వాంఛించేది! కాని, ఏం చేస్తుంది!...

...సూరయ్య కూపిరి ఉన్నంతవరకూ ఆ చుట్టుప్రక్కలకే రానట్టివా రనేకమంది, ఆయన ఇహలోకయాత్ర చాలించాడని తెలిసీ తెలియగానే వచ్చిపడ్డారు! పిల్లల పెళ్ళిళ్ళకనీ, ఇతర అవసరాలకనీ అప్పుడప్పుడూ వారివద్దా, వీరివద్దా సూరయ్య గుట్టుగా చేసినట్టి అప్పులన్నీ ఆయన మరణించగనే - ఒక్కసారిగావచ్చి పేరమ్మ



మీద పడ్డాయ్! "మరి...నోటు గీటు అక్కర్లేదంటూ మాటా, మనిషీ నమ్మక మీద ఎంతెంత రొఖ్ఖం ఎంతమందికి బదు ళ్ళిచ్చాడోగాని - ఒక్కరూ ఇప్పుడైనా పిలిచి ఇచ్చిన పాపాన్న పోలేదుగదా, ఖర్మమను"కొంటూ గుట్టుగాచేసిన బాకీలని గుట్టుగా తీర్చుకొంటేనే మానమర్యాదలు నిలుస్తాయని పేరమ్మ తొందర తొందరగా ఆ వ్యవహారాలన్నీ తేల్చేసుకొన్నది!...

...చిట్టచివరికి తణఖా తీర్చవలసిన మేడ, అయిదెకరాల పొలం మాత్రం మిగి లాయి! అంతా - ఆ వెలుగంతా ఆరిపోయి నటయింది! పాపం, చాలకాలం మనో వ్యధతో మంచం ఎక్కింది పేరమ్మ. మెల్ల మెల్లగా కోలుకొంది, చివరికి!

పొలంమీద వచ్చేగింజలు తింటూ, మేడలో చిన్నభాగంలో నివసిస్తూ - మిగతా దంతా అద్దెలకిచ్చి, ఆ వచ్చేడబ్బుతో తణఖా బాకీ తీరుస్తూ - మిగిలిన ఇద్దరు పిల్ల లకు కూడా సలక్షణంగా వివాహాలు చేయడ మెలాగా అని యోచిస్తూ కాలం గడపసా గింది...

వెనకటిలా కట్నాలివ్వలేదు; ఆర్భా టంగా పెళ్ళిళ్ళు చేయలేదు, కాని - సూరయ్యగారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లని విధంగా అమ్మాయిలను మంచిమంచి అయ్యల చేతులలో ఉంచాలి! ఎలా? పేరమ్మకీ ఆలోచనలు మతి పోగొట్టేవి...

అప్పుడు నాలుగోపిల్ల కామాక్షి తర్డ్ ఫారం చదువుతూ సమర్తాడింది. ఆడపిల్ల రజస్వలానంతరం స్కూలుకు వెళ్ళడం ఎన్నడూ ఆయింట ఆచారంగా లేదు. కాని, ఈసారిమాత్రం కామాక్షి ఇంకా స్కూలుకుపోయి పెద్ద చదువులు చదువుతా నని పట్టు బట్టింది. మొదట్లో పేరమ్మ కంగారుతిన్నా, దూరదృష్టితో కూతురి వాదానికి తలొగ్గింది, చివరికి!

అవసరాలు ఎంతఅధోగతికి ఈడుస్తాయో, అంత అభ్యుదయానికీ గొనిపోతాయి కాబోలు!...

ఆవిధంగా పేరమ్మ పట్టుదలగా కూతుళ్లకి వారి కిష్టమైనంతవరకూ ఎలాగో ఒకలాగున కష్టపడి చదువుచెప్పించడానికే నిశ్చయించు కొన్నది ... కాని, కామాక్షి - అభిలాష ఉన్నా ఆలోచనమీద స్కూల్ ఫైనల్‌తో చదువాపి, నర్సు ట్రైనింగ్‌కు వెళ్ళింది! విశాలాక్షి ఫిఫ్తుఫారం చదువుతోంది!...

కామాక్షికి తల్లి ఊహలూ, ఆ వేదనలూ బాగా తెలుసు! అందుకనే కాలేజీ గడప త్రొక్క లేకపోయింది. తాను ఉద్యోగంలో ప్రవేశించి ఆవిధంగా కుటుంబాన్ని - ముఖ్యంగా చెల్లెళ్ని ఉన్నతికి తేవాలనీ, [illegible]

వివాహమాడి తల్లిమనస్సుకు శాంతి కల్గించి - ఆవిధంగా తన జీవితాన్ని ధన్యమందించు కోవాలని కామాక్షి ఆశించింది! ఆ ఆశయాల తోనే ట్రైనింగ్ పూర్తిచేసుకొని కామాక్షి ఇంటికి తిరిగి వచ్చేవేళకి -

- ప్రకాశరావుకి తననిచ్చి వెంటనే పెళ్ళి చేయడానికి ప్రయత్నాలు జరుగుతూ వున్నాయ్ "ఇదేమిటే అమ్మా! అప్పుడే నాకు పెళ్ళా?" అని నిర్ఘాంతపోతే "నే నేంచేసేదేతల్లీ" అంటూ పేరమ్మ నీర సంగా మూల్గింది!...

తల్లి మనసు నూహించుకో గల్గింది, కామాక్షి...... పేరమ్మకి కూడా పిల్లకి వెంటనే పెళ్ళిచేయాలనే ఊహేలేదు! కాని, బంధువర్గంలో తమపై సానుభూతి నశిస్తోంది; పెద్దపిల్లల్ని చదువు లకీ, ఉద్యోగాలకీ పంపడమున్నదీ, చితికి పోవడమున్నదీ వారిలో చులకన కల్గిస్తున్నది! ఇప్పుడొచ్చిన సంబంధం అన్ని విధాల సంతృప్తి కల్గించేది! ప్రకాశరావు దూరపు బంధువు లబ్బాయే; కలక్టరేట్‌లో పని చేస్తున్నవాడు; బుద్ధిగల సుందరుడు! సూరయ్యగారి కుటుంబంపై చక్కని గౌరవం, సానుభూతి గలవాళ్ళు! మరొక ముఖ్యాంశం, వాళ్ళూ ఆ ఊరివారే! అదీ గాక, ప్రకాశరావు ఖచ్చితంగా "కట్నం అనేది ఏమాత్రం ముట్టననీ, ఎటువంటి ఆర్భా టాలూ, లాంఛనాలు అనవసరమనీ, మంచి సంప్రదాయం గల కుటుంబంలో నుండి వచ్చిన నాగరికయువతి అయితే చాలుననీ" ఆశించాడు! అతనికి కామాక్షి అన్నివిధాలా నచ్చినది. కామాక్షికీ చిన్నతనంలో సహా ధ్యాయియైన ప్రకాశరావంటే గుర్తే... ప్రకాశరావుకీ వెంటనే పెళ్ళిచేసుకోవాలని లేదు. కాని, అతని చెల్లెలుకో మంచి సంబంధంవచ్చింది. వాళ్లు "అన్నకు పెళ్ళి కానిదే, చెల్లెల్ని చేసుకోలేమ"న్నారు. కనుక - చెల్లెలికా మంచి సంబంధం పోకుండా వుండడానికని సాధ్యమైనంత తొందరలో ప్రకాశరావుకూడా పెళ్లి చేసు కోవలసిన అగత్యం పట్టింది!...ఇదంతా చూచిన పేరమ్మ లోతుగా ఆలోచించింది. ప్రకాశరావువంటి కుర్రాడిని ఏదో స్వార్థం కోసమని చేజార్చుకొంటే, తిరిగి అటువంటి సర్వోత్తమమైన సంబంధం తమ వారిలో దొరుకడమన్నది బహుకష్టం! "అంతా మన మేలుకే కానివ్వమ"ని పేరమ్మ కామాక్షికి ప్రకాశరావుతో వివాహం ఖాయపర్చు కొంది! కామాక్షికి స్వల్పప్రయత్నంమీదనే ఉన్న ఊళ్లోనే పనికూడ దొరికింది. కాని, పేరమ్మకుగాని, కామాక్షికిగాని ఆశుభవార్త ఏమాత్రం సంతోషాన్ని కల్గించలేక పోయింది. విధిగా పేరమ్మ ఉన్న అయి

దెకరాల్లో రెండెకరాలు తెగనమ్మాల్సి వచ్చింది! ఆ డబ్బు ఖర్చుపెట్టి అంతంత మాత్రంగా కామాక్షికి పెళ్ళిఅయిం దనిపిం చిందా తల్లి!

...జరిగిందొక్కరోజు పెళ్ళి, చాల నిరాడంబరంగా - సాధ్యమైనం నంత క్లుప్తంగా జరిగిపోయింది. ఆరోజంతా కూడా పేరమ్మ కేమిటో నలతగా ఉన్న ట్లుంది! జరిగిపోయిన కూతుళ్ళ పెళ్ళిళ్లు పదేపదే స్ఫురణకు తెచ్చుకుంటూ-ఆనాటి విశేషాలూ, వైభవాలూ, ఆనందోత్సా హాలూ; ప్రస్తుతంతో పోల్చుకొని-మరీ మరీ కామాక్షి దురదృష్టానికీ, తన ఖర్మానికీ దుఃఖించింది!!

ప్రకాశరావు నాగరికత, అతని విశాల హృదయం, నిర్మల భావాలూ గుర్తించిన కామాక్షి - కాలానికి కట్టుబడలేని మనుషు లకి మనోవేదనలు తప్పవని తల్లినిచూచి తెల్సుకొన్నది! కాని, అంత తెగింపుతో, ఎంతో కష్టించి చదివించి, ఏదో ఉద్ధరిస్తుం దని ఆశలో ఎదురుచూచే తల్లి కెంతో సంతోషంతో, సగర్వంగా అందించాలను కొన్న తన మొదటి జీతాన్ని అత్తగారి చేతుల్లో పెట్టున్నప్పుడు మాత్రం కామాక్షి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయ్...... చెల్లెలి కాలేజీ చదువుకోసమని అమ్మ మరో ఎకరం పొలం అమ్మిందన్న వార్త తెల్సు కొని, లోలోన కుళ్లిపోయింది! అంతకు మించి ఏంచేస్తుంది తాను?..."అవును - నే నేమి చేయగలనింక?" అనుకొంటూ, చెమ్మగిల్లిన కళ్లతో అత్తిల్లు చేరుకొన్నది, కామాక్షి...

## 3

"ఏమిచేస్తున్నావ్ కామూ?"

"రండీ! ఏమీ తోచకపోతే పుస్తక మొకటి తిరగేస్తున్నాను. ఆఫీసునుంచి ఇవ్వాళ ఇంత లేటుగా వచ్చారేం?"


# రత్నపురుషవేషం

(WITH CALCIUM & GOLD

సువర్ణము మొదలగు భస్మములు చేర్చబడినవి నికార్సైక, నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము అత్యుష్ణము, గుండెదడ కాళ్లతీపులు మొదలగు సమస్త మేహములుహరించి బలమును, కాంతిని, నరముల పటుత్వము అపరిమిత ధాతుపుష్టి నిచ్చును అనేక యోగ్యతాపత్రములు గలవు.

20 తు డబ్బి రు. 3-12-0 పోస్టేజి 1-0-0

అడ్వాన్సుగా పంపవలెను.

ఇండియన్ మెడిసన్ హౌస్,

లక్ష్మీటాకీసు రోడ్డు విజయవాడ-2.

# ★ వర్తమాన శకలం ★

"అవును. ఆఫీసులో కొంచెం ఆలశ్యమైందిలే కాని, ఏమిటా పుస్తకం అంత శ్రద్ధగా పఠిస్తున్నావ్? ఓ...ఐ. సీ...అచ్చమాంబగారి 'ప్రసూతి శిశుపోషణా?' అహ్హహ్హ ... నర్సమ్మలకి కూడా గైడ్స్ కావాల్సివస్తున్నయ్యే - చిత్రం!"

"పండితులకేగా నిఘంటువుల అవసరం!"

"వాహ్వా! బాగా చెప్పావ్!...ఆ! ఏమిటీ ఇవ్వాళ మీఅమ్మ వచ్చిందట, ఇక్కడికి?"

"అవునట"

"నిన్ను ఈ నెలలోనే తీసుకెళ్తానన్నదట!"

"అలాగా! అత్తయ్య ఏమందట?"

"ఏమంటుందీ? మీ అమ్మకి చాదస్తం కాకపోతే ఇంకా ఆరోనెలన్నా నిండలేదు, అప్పుడే ఏంతొందర చెప్పు?"

"మీఅమ్మ ఏమన్నదో చెప్పారుకారు!"

"ఇప్పుడేంతొందర అందట! అదీగాక - 'ఏదో భోజనం, నిద్ర మినహాయిస్తే మిగతా వేళంతా అయితే హాస్పటల్లో, లేకుంటే మీయింట్లోనేగా కాలం గడుపుతున్నదీ, మరేంబాధ?' అని సర్ది చెప్పిందట!"

"అ...లా...గా! మరి - మరి - మా అమ్మేమన్నదో?"

"మీ అమ్మేనా? ముఖం చిన్నబుచ్చుకొని 'అవున్లే, ఏంతొందర్లే? ఆ రోజుల్లోనైతే మా అమ్మాయిలని మా కిష్టమైనప్పుడు తెచ్చేసుకొని, తిరిగి మా కిష్టమైనప్పుడు పంపుకొనేవాళ్ళం! అయినా ఈ రోజుల్లో ఆతాహతేదీ; ఆ వ్యవహారాలేవీ? ఎలాగో ఒకలాగున కానివ్వండమ్మా, ఏంచేస్తాం?' అంటూ అలిగి లేచిపోయిందట! చూచావూ! మీఅమ్మపైకి ఇలా కన్పించినా, పాపం చాలమంచిదిసుమా! ఆమె అలా బాధపడి వెళ్ళిందంటే, నాకెంతో బాధగా వుంది. నమ్ముతావా కామూ?"

"అదేంమాట?"

"అదికాదు కామూ! మీ అమ్మ నిన్నెంత గారాబంగా పెంచుకొచ్చిందీ మాకు తెల్సు! నీకిది మొదటి కాన్పుకూడానయ్యే! నీకూ, మీఅమ్మ చేతిభోజనం తినాలనీ, మీ ఇంట్లో కాలం గడపాలనీ ఆపేక్షగా ఉంటుంది - సహజమే! కాని - "

"నీళ్లు నములుతారేం? చెప్పండీ పూర్తిగాను"

"ఇప్పట్లో నీవిక్కడ లేకుంటే, నేను [illegible]గా నీళ్ళే నమలాల్సి వస్తుంది!"

"చిత్రంగా మాట్లాడాగేనుండీ?"

"నిజం చెప్తున్నాను కామూ! ఈకుటుంబమంతా నా ఒక్కనిమీద ఆధారపడి జీవిస్తున్నది. ఇంతకాలం నేనెలా ఈ సంసారాన్ని ఈదుకొచ్చానో దేవుడి కెరుక! ఇప్పుడు, నీవు మా ఇంట్లోకొచ్చేక నీవు తెచ్చేజీతం నాకెంతో బరువు తగ్గిస్తున్నది తెలుసా?"

"అ...బ్బా! ఆఁ!"

"అవును కామూ! నిజం చెప్పుకోవడానికి నేనభిమానపడను!" నా పెళ్ళికీ, చెల్లి పెళ్లికి, చాల అప్పులయ్యాయ్! తమ్ముళ్లి చదువులకెంతో ఖర్చవుతోంది! ఈ ఇంటిపరిస్థితులేమీ నీకు తెలియనివి కావుగదా! నాన్న జబ్బుతో ఉన్నాడు - రోజు కెంత ఖర్చవుతుందో చూస్తున్నావుగా? నీవు మీఇంట్లో ఉన్నంతకాలం నీ జీతం మాకివ్వంగాని, మేము పుచ్చుకోవడంగాని బాగోదు. అలా జరుగరాదని కూడా నా సిద్ధాంతం! మరి, నీవిప్పట్లో మీఇంటికివెళ్తే - నేనొక్కణ్ణీ ఇంతభారం ఎలా భరించేదో నీవే చెప్పు కామూ? నీవు కాలు పెట్టాకనే, మా సంసారమేదో కొంచెం కుదుటపడ్డట్లయింది! తిరిగి ఓ నాల్గయిదునెలలు ఈఇల్లు ఒదిలి పెట్టావూ - మాకెంతో కష్టంగా ఉంటుందని అమ్మా నాన్నా గోల చేస్తున్నారు. అంచేతనే నిన్ను పంపడానికి నేనింత జంకుతున్నాను కామూ!"

"బాగానే ఉంది! ఇంతకీ నన్నేం చేయమంటారూ? అంతా మీఇష్టం!"

"అది కాదు. అంతా నీ ఇష్టంమీదనే ఆధారపడివుందనుకో! ఈ పరిస్థితుల్ని నీవు బాగా ఆలోచించి చూడు. నీవు గట్టిగా మీ అమ్మగారింటికి వెళ్తానంటే - నేనేం బాధపడను! ఈ వారంలోనే నిన్ను పంపే ఏర్పాట్లు చేస్తాను. మరేం ఫర్వాలేదు - ఏంసంగతీ నిర్మొగమాటంగా చెప్పెయ్ కామూ!"

".................."

## 4

ప్రకాశరావు కల్లాకపటం లేకుండా అంత ఇదిగా పరిస్థితులు వివరించి చెప్పేసరికి, కామాక్షికి ఏమి చెప్పడానికీ పాలుపోలేదు.

అటు అమ్మ - తమ పాతకాలపు హుందా నిల్పుకోవాలనీ, కూతుళ్ళకేమేమో సౌఖ్యాలందించాలనీ ఊరికే తాపత్రయపడ్తూంది! అందరి కూతుళ్లకు చేసినట్లు తన కట్టహాసంగా పెళ్ళి చేయలేకపోయాననీ, సారెన్నా సరిగ్గా పెట్టలేకపోయాననీ, కట్నమసలే ఇచ్చుకోలేకపోయాననీ, కడకు పండుగసర్దాలన్నా తీర్చలేకపోతున్నాననీ, అదనీ ఇదనీ అమ్మ కెన్నో మనోవేదనలు! కాని, ఒక్కటైనా - ఆమె ఆశలొక్కటైనా నెరవేర్చబడే సూచనల్లేవుగదా!...

ఇటేమో తన భర్త - మంచంలో పడి కొట్టుకొంటున్న తండ్రినీ, ఎన్నో ఆశలుంచుకొన్న తల్లినీ, ముగ్గురు తమ్ముళ్లనీ, ఇద్దరు చెల్లెళ్లనీ తనొక్కడి రెక్కలకష్టం మీద సమాధానపర్చుకొస్తున్నాడు. గుట్టుగా - దినదినగండం నూరేళ్లాయుష్షుగా వున్న ఆ సంసారంలోకి తాను పాదం పెట్టాక, వారంతా తన్నొక కల్పవృక్షంలా అభిమానిస్తున్నారు. ప్రకాశరావు, అతని చెల్లెలు వివాహాలకని చేసిన అప్పులు తీర్చుకోవాలి; ఒక తమ్ముడికి స్కూల్ ఫైనల్ - మరొకడికి తర్డుఫారం - ఇంకొకడికి ఫస్టుఫారం చదువుల ఖర్చులాదుకోవాలి; మిగిలిన చెల్లి పెళ్లికై ప్రయత్నాలు చేయాలి - ఇంకా, ఇంకా - అనేక అవసరాలున్నాయ్, ఆ కుటుంబంలో!...

ఈ రెంటిమధ్య నిలచిన కామాక్షికి ఏమి చేయాలో ఆలోచించేలోగానే మరో వార్తచేరింది.

విశాలాక్షికి ఏదో సంబంధం వచ్చింది. మంచిది అని లోచగానే పేరమ్మగారు పెళ్లిచెయ్యడానికి ఒప్పేసుకొన్నది. అప్పుడే బి. ఎ. పూర్తిచేసిన విశాలాక్షి తన ఊహలేమిటో ఎవరికీ చెప్పుకోలేదు కాని, తల్లి ఇష్టప్రకారమే నడవడానికి తన సంపూర్ణాంగీకారం తెల్పింది. వరుడు ఎక్కడో ఏదో హైస్కూల్లో టీచరట! కట్నం అక్కర్లేదు—హాంగులూ గిటవ్!.. సామాన్యంగా వివాహంచేసి పంపేస్తే చాలునట! "దివ్యంగా - అలాగే చేసి పంపేస్తాను" అంది పేరమ్మ.

ఉన్న రెండెకరాలు పొలం బేరం పెట్టిందని తెలిసి కామాక్షి తల్లిని కల్సుకొని అడిగింది. "అవునే - విశాల పెళ్లి ఖర్చులున్నాయా? మరికొన్ని చిల్లరబాకీలున్నాయా? రేపు పండుగలొస్తున్నాయా? అన్నింటికి తిరిగి వెతుకులాడకుండా సరిపోవచ్చునని అమ్మేస్తున్నానే!" అంది పేరమ్మ.

గ్రుడ్లనీరు కుక్కుకొంటూ "తర్వాత?-" అంది కామాక్షి. పేరమ్మ "తర్వాతా?— తర్వాత!...ముందిది కానివ్వు... తర్వాత చూచుకోవచ్చునే!" అన్నది, ఏడ్వ నారంభిస్తున్న ముఖాన్ని దాచేసుకొంటూ!....

★